# కల కానిది

పరుపును ఏకించి కుట్టించి రిక్షాలో వేసుకుని ఇంటికి రావటానికి సిద్ధంగా ఉన్నాడు గోపాలరావు. రెండు బూరుగు దూది దిండ్లు కూడా కొన్నాడు.

రిక్షావాడు రూపాయిన్నర అడిగాడు. గోపాలరావు రూపాయి ఇస్తానన్నాడు.

"పరుపుల మీద పడుకునే మారాజులు పావలాకాడ సూసుకోకండి బాబూ" అన్నాడు రిక్షావాడు.

అమ్మ దెబ్బ కొట్టాడురా అనుకున్నాడు గోపాలరావు.

కిందవాడు కిందనించి కొడుతున్నాడు. పైవాడు పైనుంచి కొడుతున్నాడు.

మధ్యవాడు ఈదెబ్బలు యిలా తినాల్సిందే.

"ఒరేయ్ పరుపుమీద పడుకున్నంత మాత్రాన సుఖం ఉందంటావుట్రా? నిజంగా నన్నడిగితే మీఊరి గుడిసెల్లోనే సుఖం ఉందంటాను. కలో గంజో యింత తిని, తాగి పడుంటారు. పావలా పరకపెట్టి సినిమా చూసొస్తారు. కాయకష్టం చేసుకుబతికే వాడి దేరా సంతోషమైన జీవితం అంటే-' అని పాతపాటే మళ్ళీ పాడేడు.

'ఏటిబాబూ నాకు తెలకడుగుతాను అడుక్కు తినేవోడికి హాయీ కూలోడికి సుకం ఉందంటారు. మరి యీ కారుల్లో తిరిగీ మేడల్లో మిద్దెల్లో ఉండేబాబులకి సుకం నేదంటారా?'

'లేదురాబాబూ డబ్బులో సుఖం లేదంటున్నాను."

"అయితే డబ్బులో సుకంనేదని తెలిసీ డబ్బుకోసం కక్కురితి పడటం జనం మానలేకుంటున్నారు. అంతేనా బాబూ?"

"అంతేరా. అంతే-"

'మరి ఈపరుపులోకూడా సుకం నేదంటూ ఇది నాచేత లాగించి యింటికి మోసుకెల్తా ఉండారు అంతేనా బాబూ!'

'పరుపులో సుఖమేవిట్రా నీ మొహం! పిల్లలు ఉచ్చలుపోసి తగలేస్తే, పెళ్ళినాడు పెట్టిన పరుపు మళ్ళీ ఏకించి కుట్టించి పట్టిగెళ్తున్నాను. అంతే-"

"ఈ పరుపుమీద ఇన్నేళ్ళూ సుకం ఎరక్కుండా పడుకున్నారన్న మాట.'

వీడు టెరిబులీయింటెలిజెంటు ఫెలో లాగున్నాడు అనుకున్నాడు గోపాలరావు.

'తవకి పిల్ల లెంతమంది బాబూ?"

"ఆరుగుర్రా నాయనా" అని హీనంగా అన్నాడు.

"అందుకే పరువు మీద సుకం నేదంటున్నారు."

'అవున్రా బాబూ-ఇప్పుడు నువ్వు రూపాయిన్నర అడిగావు గదా. నీకు రూపాయిన్నర ఇవ్వాలనే బెంగతో యీ రిక్షామీద కూర్చున్నా సుఖం లేదురా."

"పోనీ ఉట్టినే దింపేత్తే, తవరికి బెంగ తీరిపోద్దా బాబా?"

'అబ్బెబ్బే! నీ కష్టం మాకెందుకురా-నువ్వు న్యాయంగా అడగాలి, నా పరుపూ దిండ్లూ నా వాలకం చూసి వీడు అడిగినంతా యిస్తాడు కదా అని నన్ను నువ్వు ఇరకాటంలో పెట్టి డబ్బు గుంజెయ్యటం పాపంరా అబ్బీ!'

'నేయవేటి అన్నేయవేటి, బాబూ! మావు అడక్కపోతే తవరు పావలా బేడా ఇత్తానంటారు. మనిషిని కూకోబెట్టి మనిసంతమనిసి లాగి వో పావలా పరకా రావాలనుకోటం పాపం అన్నేయవైతే. మరి షావుకార్ల నాభాలన్నీ ఆల్ల ఆడోల్ల మెళ్లో బంగారలన్నీ, ఆల్ల మేడలూ మిద్దెలూ అన్నీ పాపాలు అన్నేయాలూ కావా? ఏటంటారు బాబూ-"

'ఎవరు చేసుకున్న పుణ్యం వాళ్ళదిరా. దేవుడే వాళ్ళకవన్నీ ఇచ్చేడు.'

'దేవుడు మాకేటిచ్చేడు బాబూ? ఎనక జల్మంలోన ఏవీపున్నేలు సేసుకు పుట్టనేదు. మా బతుకులు కొబ్బరితోట బతుకులైపోనాయి. ఇగ మరి ఈ జల్మలో మావు చేసుకునే పున్నేవేపాటి? దబ్బులుచ్చుకు రిచ్చాలు నాగిపాపవే సెత్తున్నావని తవరిప్పుడేగందా సెవతన్నారు. మరిమాకు ముందు జల్మంలో గూడా ఈబతుకే రాసి పెట్టుంది కావాలి'

ఈ వెధవ రిక్షా ఎక్కేను, వీడు మనసంతా చెడగొట్టాడు అనుకున్నాడు గోపాలరావు.

సినీమా తారల అర్ధనగ్న చిత్రాలు చూడ్డం అతనికి చాలా ఇష్టం. బూతు పుస్తకాలు, ఖరీదైన బొమ్మల పత్రికలు అరువుతెచ్చి చదవడం సరదా. కామ ప్రేరణ కలిగించే పెడర్థాల సినీమా పాటలు వినటం అతనికి అలవాటు.

బయట వీధిలో చూస్తే, ఒకరి మొహంలోనూ సుఖ శాంతులు సంతోషం ఆనందం ఏమీ కనపడదే?

జనం చావు పీనుగుల్లా ఉన్నారు.

శత్రురాజు పాలనలో యుద్ధంలో ఓడిపోయిన ప్రజలు జీవిస్తున్నట్లు జీవిస్తున్నారు.

జండా ఎగురుతోంది. కాని ఎగరవలసినచోట ఎగరటం లేదు,

'ఏటిబాబూ అలాగున్నారు ఉసూరుమంటా'?

ఒకరికుందని ఏడిస్తే ఓ కన్నూ తనకులేదని ఏడిస్తే మరోకన్నూ రెండుకళ్ళూ పోతాయిరా నాయనా!,

"రోడ్డుమీద అడుక్కునే గుడ్డిముండాకొడుకులంతా ఆ బాపతేనంటారా బాబూ?"

"వీడు దెబ్బల ఏజంటులాగున్నాడు కాని రిక్షావాడిలాలేడు" అని స్వగతం చెప్పుకున్నాడు గోపాలరావు.

"ఈ రెండు కళ్ళూ ఉన్నవారంతా ఎవరినీ చూసి ఏడవని బాపతేనంటారా బాబూ?

"ఒరే నువ్వు పొలిటీషియనులాగున్నావు కాని రిక్షావాడివిలా లేవు"

'ఆడెవరుబాబూ! ఆడు రిచ్చావోడికన్నా ఎక్కువా తక్కువా?'

తెలివి తేటల్ని స్వప్రయోజనానికి ఉపయోగించుకునే చాకచక్యం లేదు గోపాలరావుదగ్గర. పదిహేను సంవత్సరాలబట్టీ ఉద్యోగం చేస్తున్నా కొంప సంపాదించుకోలేక పోయాడు. అందుకని చిన్న ఇరుకైన ఒకటిన్నర గది వాటాలో ఆరుగురు పిల్లలతో, ముందు నుయ్యి వెనుక గొయ్యిలా ఉన్నకొంపలో బండి లాగించేస్తున్నాడు.

'ఇల్లొచ్చింది కాని-ఆ గుమ్మం దగ్గర ఆపు. పరుపు నేను ఎత్తుకోనా, నువ్వు తెస్తావా?"

'పరుపు నానే మోత్తాను తవరు పరుపు మీద పడుకునే సుకంనేదంటున్నారు.పరుపు ఎత్తుకోగలరా?'

దెబ్బమీద దెబ్బ కొడుతున్నాడు వీడు అనుకుంటూ ఉండగా చిరంజీవి సౌభాగ్యవతి చాముండేశ్వరీదేవి గుమ్మంలో కొచ్చి నిలబడింది.

'అదేవిటి ఆ పరుపు అంత ఎత్తుగా దెయ్యంలాగుంది?' అని కొత్త పరుపు సైజునుగురించి ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

'అణగిపోద్దమ్మా భయపడకండి.' అని రిక్షావాడు పరుపు తెచ్చి ఇంట్లో పడేసాడు.

చాముం.దేవి రూపాయిన్నర ఎందుకిస్తారు? అని భర్తను వారించింది.

'అదేటమ్మా- దెయ్యంలాగుందని తవరే అన్నారు. దెయ్యాన్నీ, బాబూగారిని కలిపి మార్కెట్ కాడనుండి లాక్కొచ్చానుకానా? అని వీధిలో కెళ్ళిపోయేడు నవ్వుకుంటూ రిక్షావాడు.

గోపాలరావు నిన్ను వాడితో మాట్లాడవద్దన్నానా అన్నట్లు చూపాడు.

'పొగరుమోతు వెధవ.....' అని చాముండేశ్వరీదేవి పరుపును పరీక్షించటంలో నిమగ్నురాలైంది.

**II**

"చిన్న సంసారం సుఖజీవనసారం" అని ప్రతి పెళ్ళి శుభలేక మీద ముద్రకొట్టాలి అన్నాడు పాలడబ్బాలు దొరకనందుకు చిరాకు పడుతూ గోపాలరావు.

"ప్రతి పెళ్ళీ రిజిస్టరు చెయ్యాలి. పెళ్ళయిన పది సంవత్సరాలదాకా పిల్లల్ని కనరాదు అని ఆర్డినెన్సు అత్యవసర చట్టం కింద జారీ చెయ్యాలి." అని గొణుక్కున్నాడు,

గోపాలరావు ఆఫీసులో చివాట్లు తినివచ్చి మడతమంచం మీద పడుకుని గోడకేసి చూస్తూ గంటలతరబడి తల తిక్కగా ఆలోచిస్తూ కాల క్షేపంచేయగలడు.

తన జీవితం అంతా మొదట్నుంచీ శుద్ధ తప్పులతడక. లీపు సంవత్సరం ఫిబ్రవరి ఇరవై తొమ్మిదో తేదీన ఇరవై సంవత్సరాల క్రితం ఇంకా ఇండియాకి స్వరాజ్యం రాకమునుపు గోపాలరావుకి చాముండేశ్వరిని ఇచ్చి (దుర్ముహూర్తం అనటానికి వీలులేదు) ఒక సుముహూర్తాన పెద్దలు తెల్లవాడి రాజ్యంలో చల్లగా పెళ్ళికానిచ్చేరు.

అలా చాముం దేవిని పెళ్ళాడ్డం మొదటితప్పు.

ఆ తరువాత-

భార్య ఈడేరి కాపురానికి వస్తే చదువు పూర్తికాకుండానే పెద్ద వెధవ పుట్టుకు రావటం, ఏదో గుమాస్తాగిరీలో దూరిపోయాక ఏటాక్రమం తప్పకుండా మగో-ఆడో పుటుకురావటం.

ఈ సృష్టిక్రమాన్ని ఆపటం ఎవడితరం?

బ్రహ్మతరవాౘ

వెధవది మనసు కట్టుకోవాలి.

'ఇనుపకచ్చడాల్ కట్టు మునిముచ్చులెల్ల

తామరసనేత్ర లింఢ్ల బందాలు కారె-"

సంసారం సుఖంగా జరగాలంటే మంచం ఇరుగ్గా ఉన్నా పరవాలేదు కాని ఇల్లుమాత్రం కాస్త విశాలంగా ఉండాలి. కాస్త దొడ్డి ఉండాలి. ఆ దొడ్లో ఒకటి రెండు వేపచెట్లో బాదంచెట్లో ఉండాలి. స్నానాలగదులు మరుగుదొడ్లు విడివిడిగా శుభ్రంగా ఉండాలి. దొడ్లో పంపులేకపోయినా అట్టే బాధలేదు. నుయ్యిమాత్రం ఉండితీరాలి. ఆ చెట్ల క్రింద పిల్లలు ఆడుకుంటారు. నూతిగట్టున బట్టలుతుక్కోవచ్చు.

చాముండేశ్వరీదేవి గోడదగ్గర బిందె బోర్లించి దానిమీద ఎక్కి నిలబడి పక్కఇంటి పిన్నిగారితోనో వదినగారితోనో పిచ్చాపాటీ చెప్పుకునే పాటి అవకాశం ఉండితీరాలి.

అప్పుడు పిల్లలు నెత్తిమీదెక్కి పిండికొట్టరు. చంటిముండ ఇల్లంతా తిరిగి ప్రాకుతుంది. చాముం దేవికి చాకిరీ కొంత తప్పితే ముఖంమీదకు చిరునవ్వు రావచ్చు.!

కాని...కాని...అంత విశాలంగా ఉన్నఇల్లు ఎలాదొరుకుతుంది?

ఇరుకుగదిలో పరస్పరం శత్రువుల్లా పోట్లాడుకుంటూ విసుక్కుంటూ తిట్టుకుంటూ గడిపే భయంకరమైన జీవితాన్ని తప్పించుకోవటం ఎలా?

అందుకే వారానికి ఒకటి రెండు సినిమాలు చూస్తాడు.

అదృష్టవశాత్తూ సినిమాల్లో ఆ కాసేపూ ఎవరూ కళపేరు చెప్పి గుండెల్ను పిండటం లేదు. గుడ్లు పీకెయ్యటంలేదు. అభూతకల్పనలు. కృత్రిమపుటావేశాలు. దొంగప్రణయాలు.

దోపిడీసిద్ధాంతాలు తెర కెక్కించి జీవితాన్ని వైమరపింపచేసి హాయికలిగించి మత్తెక్కిస్తున్నారు.

బ్రతుకును గూర్చిన భయాందోళనలు మనుష్యులను పట్టుకు పీడిస్తువున్నప్పుడు–

రేపెవరువచ్చిమన్ని ఉద్ధరిస్తారు?

రేపెలాగ గడుస్తుంది?

ఈపీడ ఎలాగ విరగడవుతుంది?

మళ్ళీ మనుష్యుల ముఖాలలో చిరునవ్వు ఎప్పుడు ఉదయిస్తుంది? ఈ ప్రశ్నార్థకాలకు జవాబు సాహిత్యం చెబుతుందా? కళలు చెబుతాయా?

II

'కాస్త భుజంమీద పిగిలిన రవికలు రెండిచ్చాను. వెలిసిపోయిన నైలాను చీర దానిమొహాన కొట్టాను. అడిగినప్పుడల్లా పావలాపరకా ఇస్తున్నాను రోజూ టీపోస్తున్నాను. దీనిమొహం మండా–రోజువిడిచి రోజూ నాగాయే!. ఏడిపించుకు తింటోంది. శనిలా మన కొంపమట్టుకు వదల్దు.'

ఏరోజు పనిమనిషిరాదో ఆ రోజు సూర్యుడు ఉదయించినా ఉదయించనట్టే.

'అలా చూస్తూ నిల్చోకపోతే ఆ లేచిన పక్కలెత్తి మంచాలు ఎండలో పడెయ్యరాదూ! అని గోపాలరావును చాముం.దేవి ఓ కసురు కసిరింది.

కిటికీలోంచి పాతకేలండరు పక్కనున్న గ్రూపుఫొటోమీద పడి ఎండ గోడమీద ప్రతిఫలించటం తదేకంగా గమనిస్తూన్న గోపాలరావు ఉలిక్కిపడ్డాడు.

పిల్లలు యింకా మంచాలమీద పడుకుని ఉండగా పక్కలు ఎలా ఎత్తటమో గోపాలరావుకి అర్థంకాలేదు.

'నామొహం మీరు చేస్తారు. నేను చూస్తాను." అని తనేవెళ్ళి తగిలించే వాళ్ళకు రెండు తగల్నిచ్చి, గుంజీ రెక్కపట్టుకులాగి లేవగొట్టేసింది.

"బాయిలరు వెలిగించాలి. ఇంట్లో ఎక్కడా చుక్క నీరు లేదు. బాతురూములో నన్ను కప్పెట్టేసినన్ని గిన్నెలున్నాయి. ఇళ్ళు తుడుచుకోవాలి ఓ మోపెడు బట్టలున్నాయి ఉతకటానికి. ఈపనిముండ రోజు రోజుకీ ఎగ్గొట్టేస్తూ ఉంటుంది. ఎంత డబ్బు పోసినా ఏమిచ్చినా విశ్వాసం లేదు. డబ్బు తింటున్నామే–ఆ అమ్మ ఒక్కర్తీ ఎలా చేసుకుంటుంది. అన్న విశ్వాసం నీతీ ఉండక్కర్లే–అందుకే వెధవలకి తిండి పుట్టకుండా ఉంది." అని గొణుక్కుంటూ తన్ను తాను తిట్టుకుంటూ అపరకాళికావతారం దాల్చి రంకెలు వేస్తోంది చాముండేశ్వరీదేవి.

"రోజూ పదిగంటలలోపున ఈ అమ్మవారితో మాట్లాడ్డం కష్టమే"అని సర్దుకోక ఏం చేస్తాడు గోపాలరావు.

'కృష్ణుడు పళ్ళపొడి మింగేస్తాడు. నీళ్ళు పుక్కిలించి ఉమ్మేయమంటే మ్రింగుతాడు. పదమూడేళ్ళొచ్చాయి. భాస్కరం వెధవకి–నాలిగ్గీసుకోవటం మర్చిపోతాడు. ఆ మొద్దుపీనుగ

కామేశ్వరికి కోసినా ఎక్కడా చురుకులేదు. కూర్చున్నచోట నుంచి లేవదు. ఎంత పిలిచినా వినిపించుకోదు. ఏ జన్మకీ వద్దురాబాబు ఇటువంటి దిక్కుమాలిన సంతానం? ఇంక కాస్సేపటికి నోళ్ళు తెరచుకుని పడిపోతారు ఆకలంటూ ఆవురావురుమంటూ. గుళ్లూ గోపురాల్నీ మ్రింగేసేలాగున్నారు. రేషను బియ్యం తిండికి కరువు ఎలాగైతే వచ్చిపడిందో వాళ్ళ ఆకళ్ళు కూడా అలానే రెచ్చిపోతున్నాయి. నావల్లకాదు బాబోయ్! ఈ దిక్కుమాలిన రాక్షససంసారానికి చాకిరీ చేయలేక నాకు చేతులూ కాళ్ళూ పడిపోతున్నాయి.' అంటూ కాఫీగ్లాసు తెచ్చి గోపాలరావు బల్లమీద చప్పుడు చేస్తూ పెట్టి... ఆ రేడియో అల్లా అరుస్తూ ఉండవలసినదే నన్నమాట ఏదీ వినిపించకుండా. ఏవీతోచకుండా' అని టక్కున దాని పీక నొక్కేసి. పంచదార డబ్బా బోర్లించి బొక్కేస్తున్న కృష్ణుడి నడ్డిమీద 'దా'మ్మని ఒకటి వడ్డించింది.

ఈ రభస చూడలేక ఇట్లీ ఎక్స్‌ప్రెస్ మొహానికి అడ్డు పెట్టుకున్నాడు గోపాలరావు.

ఇంతలో చంటిముండ ఎప్పుడు లేచిందో ఎవరూ చూడలేదు. అంతా పాడుచేసి పక్క బట్టలు మంచం నవారు చేతులు కాళ్ళూ అంతా అసహ్యం చేసేసుకుంది.

"అయితే చూస్తూ ఊరుకున్నార్నమాట. సాధించండి. అంతా కలిసి నన్ను సాధించండి. నేనేం మనిషిననుకున్నారా మాననుకుంటున్నారా. నేనూ ఓ అమ్మ కడుపున పుట్టినదాన్నే. నాకూ సుఖపడాలని ఉంటుంది" అంటూ ఒక చేత్తో ఆ గుంటముండను ఎత్తి దొడ్లో గచ్చుమీదకు కుదేసింది చన్నీళ్ళతో కడుగుతూంటే ఆ చంటిది గావు కేకలు పెడుతూ ఏడుస్తోంది ఏడ్చినందుకు మరిరెండు తగలనిచ్చింది కసిదీరా.

అశక్తులైన తల్లులు పెంచటం చేతకాక చంటిపిల్లలను పెట్టేహింసను అరికట్టడానికి ఏ శక్తులూ చాలవు.

'పాలకోసం ఏడిస్తే పీక పిసికేస్తాను ఈ ముండని. మీ పీడా నా పీడా కూడా విరగడవుతుంది. అని ఘోరమైన ప్రతిజ్ఞజేస్తూ "తెల్లారగట్టే లేచి వెళ్ళారు. ఏదీ పాలడబ్బా తెచ్చారా?" అనే భయంకరమైనటువంటి ప్రశ్న వేసింది. షావుకారి యింటికి దొడ్డి గుమ్మాన వెళ్తె ఇస్తాడని వెళ్ళి రిక్త హస్తాలతో తిరిగి వచ్చిన భర్తను.

చేతకాని వాడని హేళనచేస్తే బాగానే ఉంటుంది భర్తని. కాని అలా చేయదు. నర్మగర్భంగా మాటల్ని అనేసి గుండెలు పగిలేలా ఫిరంగుల్ని పేలుస్తూ ఉంటుంది చాముండేశ్వరీదేవి.

ఒక్కర్తీ ఇంటిచాకిరీ అంతా చేసుకోలేక సంసారం ఈదలేక అడపా దడపా రెచ్చిపోయి కేకలు పెడుతూ ఉంటుందని సర్దుకుపోయి ఏదో సంసార పక్షంగా లాగించేస్తున్నాడు.

చదువులు-పిల్లలకి పుస్తకాలు బట్టలు జోళ్ళు ఎంతెంతలేసి ఖరీదులు ఏది ముట్టుకుంటే అదే మండిపోతోంది.

ఇటూచూస్తే పురుళ్ళు ఆసుపత్రులు రోగాలు మందులు డాక్టర్లు తేతెమ్మంటున్నారు.

ఓ శుభ్రమైన గుడ్డముక్క కొనుక్కుదాంవంటే భయం! నెలకు రెండుమూడుసార్లు అయిపోతాయి ఇంట్లో సామానులు. అవి కొనుక్కోవటం కష్టంగా ఉంటోంది. కూరలసంగతి సరేసరి. నూనెలు నేతులసంగతి చెప్పాలా? వెధవది ఒళ్లు రుద్దుకొనే సబ్బుబిళ్ల ముప్పావలా-స్నానాల గదిలో పడేస్తే కాకులెత్తుకుపోతున్నాయి. ఇంటినండా ఎలికలు-అవి సరుకులన్నీ ధ్వంసం చేస్తున్నాయి. బట్టలు కొరికేస్తున్నాయి. ఆఫీసులో నానా చాకిరీచేసి అడ్డమైన వెధవలకూ అడుగులకు మడుగులొత్తి ఇంటివస్తే ఇల్లు నరకకూపంగా ఉండటమా ఎల్లపుడూ?

చాముం.దేవి నిద్రపోయేవరకూ అరుస్తూ ఉంటుంది. పిల్లల్ని బాదుతూ ఉంటుంది. తుడిచిందే తుడవటం కడిగిందే కడగటం చీపురుకట్టా, బాల్చీ, అలుగుడ్డా ఉంటేచాలు కాలక్షేపం అయిపోతుంది.

ఇల్లు ఇరకాటం, ఆలి మర్కటం. పదిరూపాయలిచ్చినా ఎవరూ నిలదొక్కుకుని పనిచేసి చావటం లేదు.

II

మూడు గంటలకు సినీమాహాలు దగ్గర ఆఖరి తరగతి టిక్కట్ల కోసం కుమ్ములాడుకుంటున్న చామంతిపూల గుంపులో పనిమనిషి నాగమ్మ కనిపించిందని గోపాలరావు దేవిగారికి చెప్పాడు.

"జ్వరం వచ్చింది రాలేనని కబురుపంపించింది. దానినాలిక చీరెయ్యాలి" అంది కామేశ్వరికి జడవేస్తూ పక్కన పడిపోయిన రిబ్బనును వెతుకుతూ తలెత్తకుండానే.

దేవిగారి అభిప్రాయం ప్రకారం పనిమనుషులు అబద్ధం ఆడకూడదు.

తినటానికే లేదంటారుకదా వీళ్ళకు సినిమాలకు డబ్బులెక్కడ్నుంచి వస్తాయి అన్న ఆలోచనను లోపలే అణచి పెట్టి-

"వాళ్ళంతేలే-" చప్పరించేసాడు.

"అది అటూ ఇటూ పోయి సంపాదిస్తూ ఉంటుంది." అని కళ్ళు అదోలా త్రిప్పి-"మీకక్కడేంపని? మీ రెందుకు వెళ్ళేరక్కడికి? అని నిలేసింది.

"నేను ఎక్కడెక్కడకు వెళ్ళేదీ. రేపట్నుంచి డైరీరాసి ఉంచుతాను" అని విసుక్కున్నాడు గోపాలరావు.

"అందుక్కాదు. అది కొంపలుతీసే కొరివి అదోలా చూసింది.

నాగమ్మకూడా మనసు కట్టుకోలేని ఆడది వెర్రిబాగులిది. దానికీ ఇద్దరు ముగ్గురు పిల్లలున్నారు. అదివాళ్ళను పెంచుకురావాలి. ఇంతలేసి జీతాలు తెస్తున్న సంసారాలే డింకీలు కొడుతున్నాయి.

అది ఎఱ్ఱగా బుఱ్ఱగా ఉన్నప్పుడు దానిని చేరదీసి ఒక కంట్రాక్టరుడు నెమ్మదిగా కాపురం వెలిగించాడనీ. యిద్దరు ఆడపిల్లలుకూడా పుట్టారని ఆ తర్వాత ఆ మారాజు

కంట్రాక్టులో ఆరిపోగానే తన్ని తగిలేసాడనీ, నాగమ్మ జీవితం వెర్రినాగమ్మ జీవితంకింద మారిందనీ కూలీనాలీ చేసుకుని అంట్లుతోముకుని బతుకుతున్నదనీ ఎవరో చెప్పారు చాముం.దేవికి.

"అలాపోయినవాళ్ళకు జరగాల్సిందే శాస్తి" అని కర్కశంగా అన్నది చాముండేశ్వరీదేవి.

గోపాలరావుది పిసరంత జాలి గుండె-

బతకటం పెద్దపోరాటం క్రింద మారిందనీ. రోజుకి మనిషికి ఇచ్చే రూపాయిన్నర కూలీ తిండికేచాలదనీ, మనం పనిమనుష్యులకు ఇచ్చే జీతం వాళ్ళకు ఎందుకూ కొరగాదనీ, అందుకే ఒకరోజువస్తే ఒకరోజు రారనీ, వాళ్ళకు యజమానులంటే లక్ష్యంలేదని, అది వాళ్ళ పాపం కాదనీ చాముండేశ్వరీదేవికి గోపాలరావు నచ్చచెప్పాలని ఎంతో ప్రయత్నించాడు.

"ఓ యాభైరూపాయలిచ్చి ఎర్రగా బుర్రగా ఉన్నదానిని పెట్టమనా మీ తాత్పర్యం?"

'అలా వందలిచ్చి పెట్టుకున్నా వాళ్ళను సెక్రటరీలంటారు.' ఆమాటలు అర్థం కాలేదు ఇల్లాలికి.

'సరేలే ముందుముందు యిళ్ళల్లో పనులుచేసేందుకు మనుష్యులు దొరకరు మనం ఇచ్చే జీతాలు వాళ్లకేం గిట్టుబాటుకావు. కూలిపనులకు పోతారు."

'చామంతి పూలెట్టుకుని ఇది మ్యాట్నీకి పోతుంది. కూలిపనేం చేస్తుంది? పిల్లలతో దీన్నెవడు పనిలో పెట్టుకుంటాడు?" అని నాగమ్మకు కూలిపనికి వెళ్ళటానికి ఉన్న అయోగ్యతలను చాటి చెప్పింది.

దీనికి మట్టిలో ఆడుతూ దిప్పమెులతో పీచుకట్టిన జుట్టుతో తిరిగే ఇద్దరు ఆడముండలున్నారు. గంజికాచి పొయ్యటమే కష్టమవుతున్న ఈ రోజులలో పిల్లలను ఎలా పెంచుతుంది? ఆకలికి వాళ్లేడుస్తూంటే ఆదరాబాదరా అటూ ఇటూ పరిగెత్తి అబద్దమో సబద్దమో ఆడి ఏ యిల్లాలి గుండెనో కరిగించి పావలా బేడా పరకా బియ్యం, గోధుమ పిండి, అడుక్కు తెచ్చుకుని పొట్టలు నింపుకోడంకన్నా నాగమ్మ మరింకేం చేస్తుంది?

అప్పుడే సినిమా డ్రస్సు మార్చేసి, మాసిన చీర కట్టి, బుడిబుడి దీర్ఘాలుతీస్తూ వచ్చింది నాగమ్మ. వెంట ఉన్న ఇద్దరు పిల్లలూ అంటకుండల్లా ఉన్నారు. . .

"దొంగలడ్డారమ్మా! పెట్టి బద్దలు కొట్టి అంతా ఎత్తుకుపోనారు."

"అంతా అంట-"

"బుడ్డిలో కిరసనాలుకూడా ఒంపేసుకుపోనారు. బట్టలెత్తుకు పోనారు'.

'చాల్లేఊరుకో-పెద్ద వెండి బంగారాలెత్తుకు పోయినట్లు అరుస్తున్నావు'.

వెండి బంగారాలు పోయిన వాళ్ళే ఏడవాలి. నాగమ్మకు ఆ హక్కు లేనట్లు చాముం.దేవి మాట్లాడింది.

'ఓ రూపాయుంటే ఇద్దు తల్లీ! పిల్లలు ఆకలికి ఏడుస్తున్నారు జరమొచ్చి పేనం సుట్టుకుపోనాది.

కళ్ళల్లో పుసులు ఓంటినిండామట్టి, సంస్కారవిహీనమైన జుట్టూ ఆ పిల్లలు నిజంగా పిశాచాల్లాగున్నారు. అందులో ఓ పిశాచం పెద్దపెద్ద కళ్లూ కాస్త పచ్చగా ఒళ్లూ పెరిగి పెద్దదయితే ఊరు ఊరంతా తన చుట్టూ తిప్పుకునేలా ఉంది.

'రూపాయెందుకూ? రెండో ఆట సినిమాకు డబ్బులు తక్కువయాయనా?"

'పిల్లలు ఆకలికి సుట్టుకుపోతున్నారంటే రెండో ఆట సినిమా అంటావేటి తల్లీ?'

'నువ్వు జ్వరం వచ్చిందని చెప్పి పని ఎగగొట్టి మ్యాట్నీ సినిమా కెళ్ళలే-'అని చాముం. దేవి తురఫాసు కొట్టింది.

'ఎవరమ్మా నీకిలాటి కిట్టని మాట సెపత-ఆల్లని నాముందుకీడుకురా సెపతాను.' అని నాగమ్మ శపథం చేసింది.

'ఎవరూ-మీ అయ్యగారే-నిన్ను సరస్వతీ టాకీస్ దగ్గర చూసానంటున్నారు.

అంత నిర్దయగా నిలదీసి అడగటం చాముం. దేవికి అట్టే బాగులేదనిపించింది గోపాలరావుకి.

'అమ్మతల్లో అయ్యగారు సూత్తే నిజమే అయ్యుంటుంది. నాను సినిమా కెళ్ళలేదుతల్లో. మేస్త్రీకాడకు డబ్బులడుక్కుందుకు పోయాను. యా యప్ప ఉన్నాది. పెత్తతల్లికూతురు. అది అచ్చం నాకుమల్లేనే ఆపడతాది. దాన్ని గావాల అయ్యగారు చూసింది. నానోపాలే ఆడా ఈడా ఎట్టాగుంటాను తల్లీ?' అని ఒక మనిషి ఒకసారే రెండుచోట్ల ఉండలేదని నాగమ్మ చాముండేశ్వరీదేవికి సయిన్సు చెబుతోంది.

రూపాయ పారేయండమ్మా మీకు పున్నెముంటాది.

గోపాలరావు జేబులోంచి రూపాయికాయితాం తీయబోయాడు. చాముం.దేవి కొరకొరా చూసింది.

నాగమ్మ పనిలోకి వెళ్ళాక-"పనిమనిషితో ఏదో నేను మాట్లాడుతూంటే మీ కెందుకూ మధ్య? దానికి డబ్బులిలాగ అలవాటు చేస్తేపట్టుకు పీడిస్తుంది. నెలజీతం పట్టుకుపోయి రోజూ డబ్బులంటే ఎల్లాగ? అని మందలిచ్చింది.

"పోన్లెద్దూ మనవేం ఊరికే యివ్వటంలేదుగా. ఆ రూపాయి జీతంలో కోసేసుకునేదేగా-'

చాముం.దేవి పనిమనిషిని విచారించబోయి తనను విచారించకుండా ఉండగలందులకు రూపాయిచ్చి తప్పించుకుందామనుకున్నాడు గోపాలరావు.

'అక్కడికి మీరు దయాసముద్రులూ నేను కఠినాత్మురాలినీ-అదసలే కొంపలు తీసే కొరివి-ఇల్లామీరు కలుగచేసుకుంటే అది నన్ను లోకువ కట్టేస్తుంది.' అంటూ వ్యాఖ్యానించింది.

దొడ్లో బాదం చెట్టు క్రిందనుంచి సినిమాపాటలు వినిపిస్తున్నాయి.

'పోకిరీపీనుగ అంట్లుతోముతూ సినిమాపాటలు పాడుతోంది. దీనింట్లో దొంగలు పడ్డారంటే నమ్మడం ఎలాగ?

గోపాలరావు మడతమంచం వాల్చుకుని డిటెక్టివ్ పుస్తకం చదువుకుంటున్నారు.

చాముం.దేవి 'అన్నట్లు మర్చిపోయాను' అని లేచి పిల్లలు తినగా మూత పెట్టిన టిఫిను పట్టుకొచ్చి గోపాలరావుకి పెట్టింది.

పిశాచాలు చూస్తూండగా టిఫిను తినటం గోపాలరావు కిష్టంలేదు. ఆ టిఫిను చాముం.దేవి చూడకుండా పిశాచాలకు పడేసి వీధిలోకి పట్టుకుపోయి తినమన్నాడు.

గిన్నెలు చప్పుడవుతున్నాయి.

"అలాటి పోకిరీపాటలు పాడకు అయ్యగారు ఇంట్లో ఉన్నారు" అంది దేవి.

"అమ్మగారూ సానాసుట్లు అడగాలనుకుని మరిసేబోతుంటాను. పేవించటం పేవించటం ఆంటాడాయిారో చినీమాలో, ఆదేటమ్మా నాన్తెల కడుగుతాను.'

'ఓహెహ్హొ అదా ప్రేమ-పెళ్లిచేసుకునేముందు హీరోయిన్తో ఆముక్క అంటాడు కథానాయకుడు.'

"మొన్న మాట్నీకాడ చినిమా ఆడేంతసేపూ తావే కళ్ళముందు ఆపడతా ఉన్నారు"

దేవి కాస్త గాబరా పడింది.

'నేను కళ్ళముందు అవుపడ్డవేమిటే నీ అఘాయిత్యం కూలా?' అని ఉత్సాహాన్ని అణుచుకోలేక అరిచింది.

'అమ్మా పైకనకూడదుకానీ ఆ సినీమాలో హీరోయినీ అచ్చం మీకుమల్లేకోక కడతాది. అదే గురుతుకొచ్చి శానాసేపు అనుకున్నా. అమ్మా మీకు వీణ వోయించటం వొచ్చా-'

"అదేవిటే పిచ్చిమొద్దూ-నా కంటే వాళ్లే బాగా డ్రస్సు చేసుకుంటారు. వీణ రాదుకాని నాకు చిన్నప్పుడు హార్మోనియం చెప్పించారు."

'తవరు పెళ్ళికి ఎలా ఉండేవారో సూడనేదు' 'ఆ అలమాని పక్కని ఫొటో ఉంది చూడు.

చూసి వచ్చింది నాగమ్మ గిన్నెలు గుడ్డతో తుడుస్తూ-

'అయ్యగోరు అచ్చం నాగేశ్వర్రావులా ఉన్నారమ్మా ఫొటోలో-' గోపాలరావుకీ మాటలు వినిపిస్తున్నాయి.

'నేనెలా ఉండేదాన్ని పెళ్లికి బొద్దుగా బంతిలా ఛెంగు ఛెంగున ఎగుర్తూ తిరిగేదాన్ని."

'అవునమ్మా సలాకలాగ సన్నగా, ఆరుగురు పిల్లలి తల్లిలాగవుపడరు'

చాముం.దేవి ముసిముసి నవ్వులు నవ్వుకుంది.

'అమ్మా అయ్యగారికి మీరంటే పేణం-సూత్తా ఉంటేనా కనిపిస్తాదీ మీ పెళ్లికూడా పేమించుకున్న పెళ్లేనేమో అని చినీమాలో లాగ.'

'నోరు ముయ్యవే-లేనిపోని కబుర్లూ' అని కసిరింది. కసిరింది కాని చాముం.దేవి లోపల చాలా సంతోషిస్తున్నది అని నాగమ్మ పసికట్టింది.

చెప్పని పనులూ చెప్పిన పనులు అన్నీ చేసేస్తోంది నాగమ్మ.

అమ్మగారూ అయ్యగారూ అచ్చం సావిత్రీ నాగేస్వ్రరావుల్లాగుంటారు అని వెళ్ళి ఫొటోదగ్గర నిలబడి వ్యాఖ్యానించింది.

'అమ్మగారూ ఎళ్లొస్తానండమ్మగోరూ-' అంటూ గారాలు కుడుస్తున్నదానిలా గోడదగ్గిర నిలబడింది.

'ఉండవే పిచ్చిమొద్దూ...' అని స్టీలు గిన్నెలో అన్నమూ, మిగిలి పోయినకూర, పులుసూ పెట్టి ఇచ్చింది. పిల్లలకు పాతగవునులు రెండిచ్చింది. రూపాయి తీసి ఇచ్చింది.

అది పిల్లలను నడిపించుకుంటూ స్టీలు గిన్నెలోని పదార్థాలతో నడచి వెళ్తూంటే గడపదగ్గర చూస్తూ నిలబడింది.

'--- సూత్తా ఉంటే నా కనిపిస్తాది మీ పెళ్లి కూడా పేమించుకున్న పెళ్ళేనేమో అని చినీమాలోలాగ' ఆ మాటలు చెవికి అమృతపు జల్లులా తగిలాయి దేవికి.

ఆ మురికి కొంప, ఆ అల్లరిపిల్లలు ఆ గుమాస్తా మొగుడు-ఆ సంసారమే నందనోద్యానవనంలా కనిపించి క్షణం సేపు స్వర్గంలో ఉన్నట్లు చాముం. దేవి ఫీలయింది.

తరవాత పనిమనిషి రాలేదు.

పిల్లముండలు ఏడుస్తూ రోడ్లమీద చింపిరి జుట్టుతో తిరుగుతున్నారు.

నాగమ్మను పోలీసులు ఎత్తుకుపోయి జైల్లో వేశారట. రాత్రిళ్ళు వీధుల్లో తిరిగే ఆడవాళ్ళను పట్టుకుని పోలీసులు కోర్టులో హాజరు పరిచారు.

పిల్లముండలు ఏడుస్తూంటే చూడలేక గోపాలరావు పోలీసుల్ని కనుక్కుని కోర్టుకెళ్ళి రహస్యంగా జుల్మానా కట్టించి నాగమ్మను విడిపించాడు.

కోర్టుదగ్గర పచ్చని చెట్టుకింద-

'తిన్నగా ఉండక-ఎందుకొచ్చిన పాడుబుద్ధులో' అన్నాడు మాట వరసకు ఏదో అనాలిగా. ఏం మాట్లాడాలో తోచక. కళ్ళు తుడుచుకుంటూ.

'మాబతుకులు మరి అడక్కండి బాబూ. చెప్పుకుంటే సిగ్గేస్తది' అన్నది నాగమ్మ బేడ రొట్టికొని ముక్కలు తుంచి టీలో ముంచి పిల్లలకు పెడుతూ.

'కలకానిది' అన్న సినీమాపాటను వాయించుకుంటూ పోతున్నాడు రోడ్డుమీద సినీమావాడు.

*(సుధ-సెప్టెంబరు 1967)*